క్లుప్తంగా

వడదెబ్బతో ఎద్దు మృతి


మృతి చెందిన ఎద్దు వద్ద రైతు చిరంజీవి

గుత్తి రూరల్: కరిడికొండలో బుధవారం వడదెబ్బతో ఎద్దు మృతి చెందింది. బాధిత రైతు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన రైతు చిరంజీవి వ్యవసాయ పనుల నిమిత్తం రెండు కాడెద్దులను కొనుగోలు చేశాడు. అయితే తన రెండు కాడెద్దులను మంగళవారం రాత్రి ఇంటి ఆవరణలో కట్టి ఉంచాడు. బుధవారం వేకువ జామున ఎద్దులకు మేత వేసేందుకు వెళ్లగా ఒక ఎద్దు నేలపై పడి ఉంది. గమనించిన రైతు వెంటనే ఎద్దును పరిశీలించగా అది మృతి చెందినట్లు గుర్తించాడు. ఎండతీవ్రతతో ఎద్దు మృతి చెందిందని, రూ.50 వేలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు.

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సూర్యనారాయణరెడ్డి

గుత్తి: కోటలోని పురావస్తు శాఖ కార్యాలయం ఆవరణలో బుధవారం గుత్తి కోట సంరక్షణ సమితి ఆధ్వర్యంలో స్వాతంత్ర సమర యోధుడు సూర్యనారాయణరెడ్డి, గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షులు విజయ భాస్కర్, టౌన్ బ్యాంకు ఉపాధ్యక్షుడే రామ్మోహన్‌లు మినరల్ వాటర్ చలి వేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో గుత్తి కోట యువజన సమితి గౌరవాధ్యక్షుడు కోనా నిషాంత్‌రెడ్డి, కన్వీనర్ చిరంజీవి, సభ్యులు జిలాన్, అర్షద్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు సృష్టిస్తే చట్టపరమైన చర్యలు


పెద్దపప్పూరులో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ శరత్‌చంద్ర

పెద్దపప్పూరు: ఎన్నికల నేపథ్యంలో ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో ఆధిపత్యం కోసం సమస్యలు సృష్టిస్తే ఎంతటివారైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రౌడీషీటర్లకు ఎస్ఐ శరత్‌చంద్ర హెచ్చరించారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మండలంలోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్లపై నిరంతరం నిఘా ఉంటుందని, ఎలాంటి గొడవలకు దిగినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో ఎలాంటి చిన్నపాటి సమస్య వచ్చినా పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

రౌడీషీటర్లు నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు

గార్లదిన్నె: రౌడీషీటర్లు నేరాలకు పాల్పడినా, ప్రోత్సాహించినా వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ మహమ్మద్ గౌస్ హెచ్చరించారు. బుధవారం పోలీస్‌స్టేషన్‌లో 24 మంది రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎన్నికల్లో రౌడీ షీటర్లు ఎవరైనా గ్రామాల్లో శాంతికి విఘాతం కలిగించినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై పీడీయాక్టు నమోదు చేస్తామన్నారు.

ఘనంగా ఏకాదశి పూజలు


దేవతామూర్తుల ప్రాకారోత్సవ దృశ్యం

పామిడి: స్థానిక చిన్న విఠోబా ఆలయంలో బుధవారం రంగసుభే ఫిర్కా ఆధ్వర్యంలో ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా రుక్మిణీ పాండురంగస్వామి విగ్రహాలను శోభాయానంగా అలంకరించి పూజలు చేపట్టారు. రుక్మిణీ పాండురంగస్వామి ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఉంచి భజనబృందం సంకీర్తనాలాపనల నడుమ ప్రాకారోత్సవం నిర్వహించారు. దీంతో ఆలయ ప్రాంగణం భక్తుల జై విఠల నామస్మరణతో మార్మోగింది. అనంతరం భక్తాదులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. ఆలయ కమిటీ సభ్యులు టీటీ శ్రీనివాసరావు, యూ మంజునాథ్‌రావు, భజన మండలి, మహిళామండలి సభ్యులు పాల్గొన్నారు.

పోలీసుల కవాతు


కవాతులో పాల్గొన్న సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్ఐ గిరిబాబు, కేంద్ర బలగాలు

యల్లనూరు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బుధవారం యల్లనూరు మండలం మేడికుర్తి, 85– నిట్టూరు , యల్లనూరు, వెన్నపూసపల్లి, తిమ్మంపల్లిలో సీఐ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో కేంద్ర పోలీసు బలగాలు కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా గ్రామాల్లో ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా ప్రజలు సహకరించాలని సీఐ కోరారు. ఎటువంటి అల్లర్లు సృష్టించినా, నిబంధనలు ఉల్లంఘించినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. బీఎస్ఎఫ్, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

గుంతకల్లులో అరాచక శక్తులకు చోటు లేదు

- పార్టీ విజయానికి సైనికుల్లా పనిచేయండి
- వైఎస్సార్‌సీపీ శ్రేణులకు ఎమ్మెల్యే అభ్యర్థి వై.వెంకటరామిరెడ్డి పిలుపు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి వై.వెంకటరామిరెడ్డి


హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

గుంతకల్లుటౌన్: ప్రశాంతతకు మారుపేరుగా నిలిచిన గుంతకల్లు నియోజకవర్గంలో అరాచకాలు సృష్టించేందుకు టీడీపీ తరఫున పోటీ చేయనున్న అభ్యర్థిని ఓటు అనే ఆయుధంతో చిత్తుచిత్తుగా ఓడించాలని వైఎస్సార్‌సీపీ గుంతకల్లు ఎమ్మెల్యే అభ్యర్థి వై.వెంకటరామిరెడ్డి వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక గుంతకల్లప్పస్వామి కల్యాణ మండపంలో వైఎస్సార్‌సీపీ శ్రేణుల విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంతమైన వాతావరణంలో జీవిస్తున్న నియోజకవర్గ ప్రజలపై గానీ, తమ పార్టీ కార్యకర్తలపై గానీ దౌర్జన్యాలు దిగుతామంటే సహించేది లేదని ఆయన ప్రతిపక్ష పార్టీ నేతలను సున్నితంగా హెచ్చరించారు. దౌర్జన్యపరుల నుంచి నియోజకవర్గం ప్రజలను కాపాడుకునేందుకు అనుక్షణం కాపు కాస్తూనే ఉంటానన్నారు. తన మంచితనాన్ని చేతగానితనంగా తీసుకోవద్దని, నాణేనికి ఒక వైపే చూశారని, మరోవైపు చూడాలని కోరుకోవద్దన్నారు. తన నియోజకవర్గ ప్రజలు, పార్టీ కార్యకర్తల హితం కోసం దేనికైనా సిద్ధమేనన్నారు. ప్రజలు పొరపాటున టీడీపీకి ఓటేస్తే గల్లీకో బెల్ట్‌షాపు, గ్రామానికో పేకాట క్లబ్ ఏర్పాటు చేయడం ఖాయమన్నారు. జగనన్న పాలనలో ఆయా కుటుంబాలకు జరిగిన మంచిని వివరించాలని ఆయన సూచించారు. రాష్ట్రంలో పేదరికం పూర్తిస్థాయిలో నిర్మూలన జరగాలన్నా, పేద పిల్లల బంగారు భవిష్యత్తుకు బాటలు పడాలన్నా మళ్లీ జగనన్నను సీఎం చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా గుంతకల్లులో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించి తనను భారీ మెజార్టీతో గెలిపించేందుకు పార్టీశ్రేణులు కష్టపడి పనిచేయాలని ఆయన కోరారు.

వైఎస్సార్‌సీపీని ఓడించడం చంద్రబాబు అబ్బ తరం కాదు

రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఓడించడం చంద్రబాబు వాళ్ల అబ్బతరం కూడా కాదని వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. జగన్‌ను అధఃపాతాళానికి తొక్కేస్తామంటూ వ్యాఖ్యానించిన పవన్‌కల్యాణ్‌పై ఎమ్మెల్యే తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఒక్క నిమిషం సక్కగా నిలబడి మాట్లాడటం చేతకాని పవన్ మరోసారి సినిమా డైలాగులతో ఎటకారంగా మాట్లాడితే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. రాష్ట్రంలో ఎన్ని పార్టీలు ఏకమైనా జగన్ గెలుపును అడ్డుకోవడం ఎవరి తరం కాదని ఆయన పేర్కొన్నారు. ఎంపీపీ మాధవి, వైస్ ఎంపీపీ ప్రభావతి, జెడ్పీటీసీ కదిరప్ప, మాజీ మున్సిపల్ ఛైర్మన్ రామలింగప్ప, పార్టీ మండల కన్వీనర్ మోహన్, సింగిల్‌విండో అధ్యక్షుడు సుంకిరెడ్డి, మార్కెట్‌యార్డు ఛైర్మన్ ఎస్‌వీఆర్.మోహన్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ గోవింద్‌నాయక్, మండల పోలింగ్ బూత్ కన్వీనర్ రాము, నియోజకవర్గం సోషియల్ మీడియా కోఆర్డినేటర్ జయరామిరెడ్డి, దేవేంద్రప్ప, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోండి


ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న ఎన్నికల అధికారులు

తాడిపత్రి అర్బన్: నియోజకవర్గవ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఓటరు తన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని అసిస్టెంట్ ఎన్నికల అధికారి తహసీల్దా ఆంజనేయులు కోరారు. బుధవారం పట్టణంలోని పోలింగ్ నమోదు శాతం తక్కువగా ఉన్న 204, 205 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అపార్టుమెంట్లలో నివాసం ఉండేవారు, కంపెనీల్లో పనిచేసే కార్మికులు, ఐటీఉద్యోగులు, విద్యార్థులతో పాటు ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా బీఎల్‌ఓలు అవగాహన కల్పించాలన్నారు. ప్రజలను ఎన్నికల్లో పెద్ద ఎత్తున భాగస్వామ్యం చేసేందుకు అనువైన సూక్ష్మ ప్రణాళికలను రూపొందించి అమలు పరిస్తే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. అన్ని పోలింగ్ స్టేషన్ల పరిధిలో సామాన్య ప్రజలు కూడా చైతన్యవంతులై ఎన్నికల ప్రక్రియలో పూర్తీ స్థాయిలో భాగస్వాములను చేయాలని కోరారు. నోడల్ అధికారి రాజ్యలక్ష్మి, టీపీఆర్వో సతీష్, మెప్మా సీఎంఎం తులసి, బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మరోమారు జగనన్నను ఆశీర్వదించండి



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి. పోరాటకాలనీలో నవరత్నాలపై మహిళలను ఆరా తీస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రిటౌన్: పేదల సంక్షేమ ప్రభుత్వం కొనసాగాలంటే మరోసారి జగనన్నను ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ప్రజలను కోరారు. మండలంలోని తాతగారిపల్లి, యర్రగుంటపల్లి, దిగువపల్లె, ఎగువపల్లె, తేరన్నపల్లెలో బుధవారం ఆయన సుడిగాలి పర్యటన శారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఆయనకు గ్రామస్తులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. అనంతరం ఆయా గ్రామాల్లోని వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానుల ఇళ్లకు వెళ్లి వారి కుటుంబ సభ్యుల యోగక్షేమాలు తెలుసుకున్నారు. సమస్యల పై ఆరా తీశారు. గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు కలసికట్టుగా పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మరోసారి వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ రాజు, మార్కెట్ యార్డ్ వైస్ ఛైర్మన్ ఓబులరెడ్డి, మండల కన్వీనర్ పల్లె నాగేశ్వరెడ్డి, నాయకులు ఆలూరు రామేశ్వరెడ్డి, కిషోర్ రెడ్డి, సూర్యనారాయణ, నాగేశ్వరరెడ్డి, కాశి, సురేష్, వెంకటేశ్వరెడ్డి, మోహన్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, క్రిష్టారెడ్డి, పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటమిభయంతో జేసీ సోదరులు ఇంటింటికీ తిరుగుతున్నారు..

జేసీ సోదరులు ఓటమి భయంతో ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఓట్లు అడిగే పరిస్థితి వచ్చిందని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. ఎగువపల్లెలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. గతంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా జేసీ సోదరులు గ్రామాల్లో రచ్చకట్టల వద్దకు వచ్చి వారి మనుషులను పిలిపించుకొని ఊర్లో ఓట్లు వేయించాలని చెప్పేవారన్నారు. పైగా ప్రజలు ఓటు వేయకపోతే తాను ఓడిపోతానా అంటూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేవారన్నారు. కానీ నేడు ఆపరిస్థితి లేదని, ప్రస్తుతం జేసీ సోదరులు ఇంటింటికీ వెళ్లి ఓట్లు అడుగుతున్నారంటే తన ఘనతే అన్నారు. వైఎస్సార్‌సీపీలో తనకు దూరంగా ఉన్న ఒక్కరిద్దరిని పార్టీలో చేర్చుకున్నారని, వారి వెంట పార్టీ కార్యకర్తలు ఎవ్వరూ వెళ్లక పోవడంతో టీ అంగళ్ల దగ్గరున్న వారిని రూ.500 చొప్పున ఇచ్చి జేసీ సోదరులతో టీడీపీ కండువా వేయిస్తున్న పరిస్థితి నెలకొందన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

తాతగారిపల్లెలో 5 కుటుంబాల వారు బుధవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి వారికి కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో తిరుపతినాయుడు, ఉపేంద్ర, నాగేంద్ర, లోకనాథరెడ్డి, భగీరథరెడ్డి ఉన్నారు.

పట్టణంలోని పోరాటకాలనీలో ఎన్నికల ప్రచారం

తాడిపత్రిరూరల్: పట్టణంలోని పోరాటకాలనీలో బుధవారం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి 58 నెలల్లో ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి అందిన లబ్ధిని వివరించారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పాలన కొనసాగాలంటే మరోసారి ఫ్యాన్ గుర్తుకు ఓటేసి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రెడ్డి, నాయకులు అంబటి రాఘవ, బాబు, వరదయ్య తదితరులు ఉన్నారు.

ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రం ఏర్పాటు చేయండి

- నియోజక ఎన్నికల అధికారికి కలెక్టర్ గౌతమి సూచన


అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాలలో భవనాలను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమి

శింగనమల: శింగనమల నియోజకవర్గానికి సంబంధించిన ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రం, స్ట్రాంగ్ రూంలను త్వరగా ఏర్పాటు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమి నియోజకవర్గ ఎన్నికల అధికారి వెన్నెల శ్రీనుకు సూచించారు. మంగళవారం ఆమె అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాలలో శింగనమల ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రం కోసం భవనాలను పరిశీలించారు. శింగనమల నియోజకవర్గానికి సంబంధించి ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రం, ఈవీఎంల కమిషనింగ్, స్ట్రాంగ్ రూంల కోసం ఏర్పాట్లను వేగవంతం చేయాలన్నారు. ఎన్నికల నిబంధనల మేరకు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. భద్రతాపరంగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా జాగ్రతలు తీసుకోవాలని సూచించారు. అనంతపురం ఆర్‌డీఓ వెంకటేశు, ఎన్నికల అధికారి వెంకటేశు, తహసీల్దారు శోభన్ బాబు, ఈఆర్ఐఓలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలి



పోస్టర్లు విడుదల చేస్తున్న వైద్యసిబ్బంది

గార్లదిన్నె: ప్రజలు వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ డాక్టర్ గౌతమి పేర్కొన్నారు. బుధవారం స్థానిక పీహెచ్‌సీలో ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా కార్యక్రమ పోస్టర్లు ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రోజూ రెండుసార్లు దంతాలు శుభ్రం చేసుకోవాలన్నారు. అలాగే ఉప్పు నీటితో పుక్కలించి నోటి దుర్వాసన, సమస్యలు నివారించుకోవాలన్నారు. ఎండలు ఎక్కువగా ఉండడంతో ప్రతి ఒక్కరూ తెలుపు రంగుగల పలుచటి కాటన్ వస్త్రాలు ధరించాలన్నారు. బయటకు వెళ్లాల్సి వస్తే తలకు టోపీ ధరించి బయటకు వెళ్లాలన్నారు. మజ్జిగ, గ్లూకోజ్ నీరు అధికంగా తీసుకోవాలన్నారు. తలనొప్పి, తలతిరగడం ,తీవ్రమైన జ్వరం మత్తు నిద్ర, కలవరింతలు, ఫిట్స్ వంటి లక్షణాలు కనిపించిన వెంటనే చల్లటి నీడ ప్రాంతంలోకి చేర్చాలన్నారు. చల్లనీటితో తడిపిన బట్టతో శరీరం ఉష్ణోగ్రత తగ్గేవరకు తుడవాలన్నారు. ప్రథమ చికిత్స అనంతరం సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాలన్నారు. పెనకచెర్లలో కూడా వడదెబ్బపై ప్రజలకు అవగాహన కల్పించారు. సీహెచ్‌ఓ లోక్‌నాథ్, ఆరోగ్య విస్తరణ అధికారి నాగేశ్వరయ్య, పీహెచ్ ఎన్ అరుణ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని కొనసాగించుకుందాం


మహిళతో మాట్లాడుతున్న కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

తాడిపత్రిటౌన్: మరోసారి జగనన్నను ఆశీర్వదించి సంక్షేమ ప్రభుత్వాన్ని కొనసాగించుకుందామని ఎమ్మెల్యే తనయుడు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి గన్నెవారిపల్లి కాలనీ వాసులను కోరారు. బుధవారం ఆయన కాలనీలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కాలనీ వాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు అందాయా అంటూ ప్రశ్నించారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిగా కొనసాగాలన్నారు. ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మార్కెట్‌యార్డ్ ఛైర్మన్ ఓబులరెడ్డి, పల్లె నాగేశ్వరెడ్డి, కాలనీ ఇన్‌ఛార్జ్ ప్రదీప్‌రెడ్డి, ఎంపీటీసీ రవి కుమార్, ప్రభాకర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ప్రణయ్‌కుమార్, ప్రభాకర్, నాగేంద్ర, శివ, కుళ్లాయప్ప, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సేవాదృక్పథం అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న ఎన్ఎస్ఎస్ పీఓ చిన్న పుల్లయ్య

బుక్కరాయసముద్రం: విద్యార్థులకు చదువుతో పాటు సామాజిక సేవాదృక్పథం అలవర్చుకోవాలని జిల్లా చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ కృష్ణమాచారి పేర్కొన్నారు. బుధవారం రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో రోటరీపురంలో 7 రోజుల పాటు జాతీయ సేవా పథకం ఎన్ఎస్ఎస్ యూనిట్–1 ప్రత్యేక శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల ఎన్ఎస్ఎస్ పోగ్రాం ఆఫీసర్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత చిన్న పుల్లయ్య మాట్లాడుతూ విద్యార్థులు సమాజాభివృద్ధికి తమ వంతు తోడ్పాటునందించాలన్నారు. అనంతరం గ్రామంలో విద్యార్థులు వివిధ అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం అజయతుల్లా, ఐక్యూఏసీ కన్వీనర్ డాక్టర్ చైతన్య కిశోర్, మెకానికల్ విభాగం అధిపతి డాక్టర్ వంశీకృష్ణ, మధుసూదన్, అరవింద బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గార్లదిన్నె: మండల కేంద్రంలో 44వ జాతీయ రహదారిపై విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు.. అనంతపురము నుంచి తల్లీకుమారుడు రామాంజినమ్మ, సాంబశివ బైక్‌పై పామిడికి బయలుదేరారు. విద్యుత్ సబ్‌స్టేషన్ వద్దకు రాగానే వెనుకల నుంచి టిప్పర్ ఢీకొన డంతో తల్లి,కుమారుడికి గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు క్షతగాత్రులను గార్లదిన్నె పీహెచ్‌సీకి తరలించారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

గార్లదిన్నె: మండలంలోని పెనకచెర్లలో ఓ వివాహిత ఆత్మహత్యకు యత్నించింది. 108 సిబ్బంది తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన ఈశ్వరమ్మ ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుమందుతాగింది. కుటుంబ సభ్యులు గమనించి 108లో ఆమెను అనంతపురము ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియరాలేదు.

వార్డుల్లో కమిషనర్ పర్యటన

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలోని 3,4,14,17,వ వార్డుల్లో బుధవారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సమస్యలపై ఆరా తీశారు. తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సచివాలయ ఉద్యోగులు, వాటర్ వర్క్స్ సిబ్బందిని ఆదేశించారు.

జూదరుల అరెస్ట్

పుట్లూరు: కడవకల్లు గ్రామంలో బుధవారం పేకాట

సంక్షిప్త సమాచారం

కేంద్రంపై దాడి చేసి ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ హేమాద్రి తెలిపారు. గ్రామానికి చెందిన బాల వెంకటరెడ్డి అనే రైతు తోటలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడులు చేశామన్నారు. ఈ దాడిలో ఆరుగురు జూదరులు, రూ.9380 నగదు పట్టుబడినట్లు ఆయన వివరించారు.

మెడికల్ షాప్‌లో చోరీ

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లోని మెయిన్ బజారులో ఉన్న హాజీ మెడికల్ షాప్‌లో చోరీ జరిగింది. ఈ ఘటన మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. గుర్తు తెలియని దొంగలు మెడికల్ స్టోర్ షట్టర్ తాళాలు పగల గొట్టి లోపలికి ప్రవేశించారు. లోపలున్న రూ.10 వేల నగదును ఎత్తుకెళ్లారు. ఈ ఘటనపై మెడికల్ స్టోర్ నిర్వాహకుడు అమీర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ నబీరసూల్ చోరీ జరిగిన మెడికల్ స్టోర్‌ను పరిశీలించారు.

నాటుసారా విక్రేత అరెస్టు

యాడికి: కమలపాడు గ్రామానికి చెందిన శేఖర్ బుధవారం కమలపాడు గ్రామానికి వెళ్లే దారిలో నాటుసారా విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. నిందితుడి నుంచి 9 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు.

తాతార్యారూఢ స్వామి తిరునాల ప్రారంభం

గార్లదిన్నె: మర్తాడులో బుధవారం తాతార్యారూఢ స్వామి తిరునాల ప్రారంభమైంది. మొదటి రోజు వేద పండితుల నడుమ స్వా మి వారికి ధ్వజారోహణ, మహాన్యా సపూర్వక రుద్రాభిషేకం నిర్వహి ంచారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. గురువారం గంగ పూజ, కలశ స్థాపన, రుద్రయజ్ఞం స్వామి వారికి ఆలయ ధర్మకర్త ఆదినారాయణ పట్టు వస్త్రాల సమర్పణ, సహస్ర బిల్వార్చన, రాత్రి 10 గంటలకు స్వామివారి పుష్ప రథోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశామన్నారు.

సింహవాహనంపై చెన్నకేశవుడు



యాడికి: మండల కేంద్రంలో బుధవారం రాత్రి శివలక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చెన్నకేశవుడు సింహవాహనంపై భక్తులకు దర్శన మిచ్చాడు. ఉదయం ఆలయ అర్చకుడు హరికృష్ణ శర్మ చెన్నకేశవ స్వామి వారికి ఉత్సవ హోమ కార్యం, అభిషేకార్చనలు తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి 10 గంటల సమయంలో శ్రీదేవి,భూదేవి సమేత శివలక్ష్మీ చెన్నకేవవ స్వామికి సింహవాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, ఉప సర్పంచు కాసా చంద్ర మోహన్, ఎంపీటీసీలు నాగరాజు, వెంకటనాయుడు భూపాళం హరినారాయణ, భూపాళం నాగ పుల్లయ్య, భూపాళం సత్యనారాయణ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

పుట్లూరు: తిమ్మనచెరువు వాసి మహేశ్వరెడ్డి బుధవారం అనుమతి లేకుండా ఇసుక తరలిస్తుండగా ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ హేమాద్రి తెలిపారు.

IndusInd Bank - CFD
COMMERCIAL VEHICLES FOR SALE
MAHINDRA & MAHINDRA LIMITED BOLERO PIK-UP FB PS 1.7 XL 2022 MODEL
AP39 UD 8005
Cell : 97015 65620
15/711/11, 2nd Floor, SMS Plaza, Upstairs of Axis Bank, TADIPATRI.

జగన్ సంక్షేమ పాలన చరిత్రాత్మకం



ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు, బీకేఎస్‌లో సంక్షేమ పథకాలను వివరిస్తున్న వీరాంజనేయులు, నాయకులు

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజినేయులు

బుక్కరాయసముద్రం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్లలో చేపట్టిన సంక్షేమ పాలన చరిత్రాత్మకమైందని వైఎస్సార్ సీపీ శింగనమల ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం మండల కేంద్రంలోని కేవీఎస్ గిరిప్రసాద్‌నగర్, దక్షిణామూర్తి నగర్, చాకలి ఐలమ్మ కాలనీల్లో వైఎస్సార్ సీపీ నాయకులతో కలసి పర్యటించారు. కాలనీల్లో ఉన్న ప్రజలను పలకరిస్తూ సీఎం వైఎస్ జగనన్న ప్రవేశ పెట్టిన పథకాలను వివరిస్తూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తమను ఆదరించాలని ప్రజలను కోరారు. ముందుగా ఆయనకు కాలనీ వాసులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పూల మాలలతో టపాసులు పేలుస్తూ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుల, మత, రాజకీయ పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించారన్నారు. రాష్ట్ర రాజకీయ చరిత్రలో ఇన్ని సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టిన సీఎం ఎక్కడా లేరన్నారు.

బాబువి తప్పుడు వాగ్దానాలు

ప్రతిపక్ష నేత చంద్రబాబు 14 ఏళ్లుగా సీఎంగా ఉండి చెప్పుకునే పథకం ఒక్కటైనా ఉందా అని ప్రశ్నించారు. మళ్లీ రాష్ట్రంలో ప్రజలను మోసం చేయడానికి చంద్రబాబు తప్పుడు వాగ్దానాలు చేస్తున్నారని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ జగనన్న నెరవేర్చడమే కాకుండా అనేక పథకాలను ప్రవేశ పెట్టారన్నారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తమను గెలిపించాలని కోరారు. జెడ్పీటీసీ భాస్కర్, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ అంకే నరేష్, సర్పంచు పార్వతి, వైస్ ఎంపీపీ రామగోపాల్, జేసీఎస్ మండల కన్వీనర్ బయపరెడ్డి, ఎంపీటీసీ సుజాత, వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి లలితా కళ్యాణి, బుల్లే రాజా, ఎస్సీ, ఎస్టీ సెల్ కన్వీనర్లు వరికూటి కాటమయ్య, సాకే లక్ష్మి నారాయణ, ఈశ్వరయ్య, అంజి, లచ్చి, సూరి, శేషానంద రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, సాయి, శ్రీనివాసరెడ్డి, శివారెడ్డి, నాగరాజు, రాజారెడ్డి, సుబ్బరాయుడు, బయన్న, కుళ్లాయప్ప పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
తాడిపత్రి డివిజన్
9912220722, 9010223701
9912220732, 9010588846